నెరవేరుతున్న సొంతింటి కల

- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- పైలెట్ ప్రాజెక్టు కింద దుబ్బతండా ఎంపిక
- సకాలంలో బిల్లులు చెల్లింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



స్లాబ్ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

పెన్‌పహాడ్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పైలెట్ గ్రామంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సహకారం చేయాలని సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి పథకానికి శ్రీకారం చుట్టింది.

వేగవంతంగా నిర్మాణ పనులు..

మండలంలోని దుబ్బతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మొదటి విడత పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన దుబ్బతండాకు 18మంజూరయ్యాయి. 400 నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటిని నిర్మించాలని నిబంధన మేరకు అధికారులు 7ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. ఇందులో 3 ఇళ్లు బేస్‌మెంట్ వరకు, రూఫ్‌లెవల్ 3వరకు, మరో ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు పూర్తయింది. స్లాబ్ లెవల్ రూ. 4లక్షలు చొప్పున ఒకరికి, బేస్‌మెంట్ లెవల్ ముగ్గురు రూ.లక్ష చొప్పున, రూఫ్‌లెవల్ వరకు ముగ్గురు లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. ఇళ్ల నిర్మాణ పనులను గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. 10 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టమని అధికారులకు చెప్పినట్లు సమాచారం.

నాలుగు దఫాలుగా బిల్లులు..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో బేస్‌మెంట్ వరకు పూర్తి చేసిన వెంటనే అధికారులు ఫొటోలను అప్లోడ్ చేయగానే వారం రోజుల వ్యవధిలోనే రూ.లక్ష నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుంది. రూఫ్‌లెవల్ గోడల వరకు నిర్మాణం పూర్తి చేస్తే రూ.లక్ష, స్లాబ్ పూర్తయ్యాక రూ.2లక్షలు, ప్లాస్టరింగ్, డోర్ ఫిట్టింగ్, కలర్ పూర్తయ్యాక చివరి బిల్లు రూ.లక్ష అందిస్తారు. ఇలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎంత వేగంగా పూర్తి చేస్తే బిల్లులు కూడా అంతే వేగంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సొంతిల్లు పూర్తి అవుతుండడంతో సంతోషంగా ఉంది



ఇందిరమ్మ ఇంటి నిర్మాణం మొదలు పెట్టాం. బేస్‌మెంట్, రూఫ్‌లెవల్ పూర్తయింది. అధికారులు పరిశీలించి రూ.2 లక్షలు బిల్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అనుకుంటున్నాం. సొంతింటి కల నెరవేరుతుండడంతో సంతోషంగా ఉంది.

– అంగోతు లక్ష్మి దుబ్బతండా

బిల్లులు త్వరగా వస్తున్నాయి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రోత్సహిస్తున్నాం. పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన దుబ్బతండాలో ఇందిరమ్మ నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. నిబంధనల మేరకు ఇల్లు నిర్మించుకుంటే వెంటనే బిల్లులు చెల్లిస్తున్నాం.

– వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ

ఎర్రజెండాతోనే ప్రజా సమస్యలు పరిష్కారం



పెన్‌పహాడ్ : స్మారకస్తూపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మల్లు లక్ష్మి

పెన్‌పహాడ్ : ఎర్రజెండాతోనే ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు మరిపల్లి వెంకయ్య స్మారకస్తూపం నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. తన జీవితాంతం ఎర్రజెండా అభ్యున్నతి కోసం నిస్వార్థంగా వెంకయ్య పనిచేశారని అన్నారు. దొరలను ఎదిరించి పేద ప్రజల వైపు పోరాడుతున్న క్రమంలో అనేక నిర్బంధాలు జైలు జీవితాన్ని కూడా అనుభవించారన్నారు. ఆయన స్మారకార్థం స్తూపాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందాయన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో దేశ పౌరులపై హత్యాకాండ సరైంది కాదన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో ఉందని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, రణపంగ కృష్ణ, చినపంగి నర్సయ్య, గుర్రం గోపాల్‌రెడ్డి, కొండమీది రాములు, భోగరాజు శ్రీకాంత్, ఇరుగు రమేష్, బుచ్చిరాములు, జంపాల స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

మల్సూర్ కుటుంబానికి పరామర్శ

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన రాపర్తి మల్సూర్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. దీంతో వారి కుమారుడైన బీఆర్‌ఎస్ నాయకుడు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, రాపర్తి రమేష్‌గౌడ్‌లను సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి బుధవారం పరామర్శించారు. అలాగే ఇటీవల కక్కిరేణి శివకుమార్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు కక్కిరేణి సత్యనారాయణను పరామర్శించారు. ఆమె వెంట పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు తదితరులు ఉన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

సూర్యాపేట : పట్టణ పరిధిలోని దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి దేవస్థాన కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 26న జరిగే గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా మూడో మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. రెండో విడత గొర్రెల పంపిణీ నగదు బదిలీ చేయాలని కోరారు. పశు వైద్యశాలలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. గొర్రెలు, మేకల పశుగ్రాసం కోసం ప్రతి గ్రామం సొసైటీకి 10ఎకరాల భూమి ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మట్టిపల్లి సైదులు, ఉపాధ్యక్షుడు కంచుకోట్ల శ్రీనివాస్, రాజుల నాగరాజు, వేల్పుల వెంకన్న, గుండాల శివ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలని వినతి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఆత్మకూర్(ఎస్) : మండలంలోని ఇస్తాళ్లాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవకతవకలు, అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటిపై విచారణ చేసి రైతులకు తగిన న్యాయం చేయాలని గ్రామానికి చెందిన రైతులు బుధవారం ఐకేపీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ధాన్యాన్ని అధికంగా తూకం వేయడంతో పాటు ట్రక్ షీట్లలో ధాన్యం లేని రైతుల పేరు రాయడం, వారి పేరున బిల్లులు రావడం లాంటి అవకతవకలు ఎన్నో జరిగాయని ఆరోపించారు. గ్రామానికి చెందిన గడ్డ విద్యాసాగర్‌రెడ్డి ధాన్యాన్ని అమ్మకపోయినా ఆయన పేరుతో 15 బస్తాల ధాన్యం అమ్మినట్లు ట్రక్ షీట్లను చూపించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల వారు చేసే అక్రమాలు బయటకు వచ్చాయన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాలు బయటకు వస్తాయని ఆరోపించారు. రైతులను మోసం చేస్తున్న ఐకేపీ కేంద్రం నిర్వాహకులపై విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మద్రు బాబురావు, తూడి రాములు, రమణమ్మ, కప్పల నాగయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం



సూర్యాపేట : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ సుబ్బలక్ష్మి

సూర్యాపేట : పట్టణంలోని 21వ వార్డు జమ్మిగడ్డ సెక్టార్ అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుబ్బలక్ష్మి పాల్గొని మాట్లాడారు. బడి ఈడు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి వారి ఆరోగ్య అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దాసరి గీత, అంగన్‌వాడీ టీచర్ బాణాల పద్మ, ఆయా సాలేహ, తల్లిదండ్రులు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో నూతనంగా చేరిన ప్రీస్కూల్ విద్యార్థులతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, ఏఎన్‌ఎం ఎల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, రూప, సంతోష, సుమతి, నర్సమ్మ, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి



అర్వపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నగేష్‌నాయక్

నాగారం : డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.మారయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా నివారణపై వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి అధికారుల టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి నుంచి ఈ నెల 31వరకు అతిసార వ్యాధి (డయేరియా) నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వానాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పిల్లలు డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో మండల వైద్యాధికారి డాక్టర్ బొమ్మగాని హర్షవర్ధన్, ఎంఈఓ వాసం ప్రభాకర్, సీహెచ్‌ఓ మాలోతు బుచ్చునాయక్, హెచ్‌ఈ విమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, షఫీ, యాదగిరి, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మిబాయి, నాగరాజు, నాగమ్మ, సుమ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై టాస్క్‌ఫోర్స్ సమావేశం

అర్వపల్లి : మండలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై బుధవారం స్థానిక పీహెచ్‌సీలో మండల స్థాయి అధికారుల టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు పిల్లలను ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వ్యాధుల బారిన పడిన వారిని గుర్తించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని కోరారు. అదే విధంగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి.శ్రీకాంత్, మండల వైద్యాధికారి నగేష్‌నాయక్, ఎంపీడీఓ గోపి, ఎంఈఓ బాలునాయక్, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

మద్దిరాల : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిగూడెం, కుక్కడం, కుంటపల్లి ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం కుక్కడం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పాఠ పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. అదేవిధంగా రెడ్డిగూడెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి మాట్లాడారు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోటి పుస్తకాలు, అందజేయనున్నట్లు తెలిపారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాల మోజులో పడి అధిక ఫీజులు చెల్లించి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కాట్ల రవికుమార్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

- ఎస్పీ నరసింహ



మద్దిరాల : పోలుమల్లలో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

మద్దిరాల : ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పెద్దమనుషులు ఆదర్శంగా ఉండాలని, అపరిచితులు ఎవరైనా బహుమతులు ఇస్తాం అంటే నమ్మవద్దన్నారు. నకిలీ విత్తనాల పట్ల ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో భూమి సంబంధిత సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. మన రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న పోలీసు వ్యవస్థ ప్రజల కోసం అనునిత్యం పని చేస్తుందన్నారు. జిల్లాలో ప్రతి బుధవారం 8గ్రామాలు ఎంచుకొని పోలీసు ప్రజా భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. అనంతరం సామాజిక అంశాలపై పోలీసు కళాబృందం వారు ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ నరసింహారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, స్థానిక ఎస్‌ఐ వీరన్న, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేయడమే ప్రజా భరోసా లక్ష్యం

సూర్యాపేటటౌన్ : ప్రజలను చైతన్యం చేయడమే పోలీస్ ప్రజా భరోసా లక్ష్యమని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని 24వవార్డులో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు మరింత చేరువయ్యేందుకే పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వార్డులలో సామాజిక అంశాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల సహకారం లేకుండా పోలీస్, న్యాయ వ్యవస్థ పటిష్టంగా పనిచేయడం సాధ్యపడదన్నారు. ప్రజలంతా చట్టాన్ని గౌరవిస్తూ, అన్యాయాన్ని సహించకుండా ముందుకు వస్తే పోలీస్ శాఖ మేమున్నామంటూ భరోసా ఇస్తుందన్నారు. సమాజంలో యువత మాదక ద్రవ్యాలకు, ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసలు కాకుండా, చదువు, ఉద్యోగాలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ప్రధానమన్నారు. ప్రతి బుధవారం ఒక వార్డును ఎంచుకొని పోలీస్ అధికారులు పాల్గొనేలా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ ఆంజనేయులు, ఏఎస్‌ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ మేఘ్య, వార్డుపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెన్‌పహాడ్ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని లింగాల గ్రామంలో రాత్రి నిర్వహించిన పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేరాలు జరగకుండా ముందస్తుగా అనేక చర్యలు చేపడుతున్నామన్నారు. పోలీసు విధుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద చనిపోతే కుటుంబం అంతా రోడ్డున పడతారన్నారు. ఏదైనా సంఘటన జరిగితే 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపికృష్ణ, హెడ్‌కానిస్టేబుళ్లు అంగోతు యాదగిరి, మురళీధర్‌రెడ్డి, కానిస్టేబుల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటటౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

నేడు మండల స్థాయిలో క్రీడా పాఠశాలలకు ఎంపిక

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నకిరేకంటి రవి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4వ తరగతి చదువుతున్న ఆసక్తి కలిగిన విద్యార్థులు నేడు ఉదయం 10గంటలకు ఆన్‌లైన్ దరఖాస్తులతో పాటు సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలతో బోనోఫైడ్ సర్టిఫికెట్, తల్లి లేదా తండ్రిని వెంట తీసుకొని రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

20న స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక

తిరుమలగిరి : తెలంగాణ ప్రభుత్వం క్రీడా పాఠశాలలకు 2025–26సంవత్సరానికి గాను 4వతరగతిలో ప్రవేశానికి మండల స్థాయిలో ఈ నెల 20న స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఐ.శాంతయ్య బుధవారం తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి దళితులకు ఇవ్వాలి

తుంగతుర్తి : కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి దళితులకు ఇవ్వాలని సంవిధాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్ క్యాస్ట్రో కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్ష పదవిని ఇంతవరకు ఎస్సీలకు ఇవ్వలేదని, పార్టీ అధిష్టానం, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే సామేలు చొరవ తీసుకొని మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన చింతకుంట్ల వెంకన్నకు కేటాయించాలని కోరారు. సమావేశంలో భువనగిరి పార్లమెంట్ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెద్దబోయిన అజయ్, అక్కినపల్లి నరేష్, అబ్దుల్, మల్లెపాక సుమన్, పరుశురాములు, బొంకూరి జలంధర్, చింతకుంట్ల రాజు, చింతకుంట్ల మైసయ్య, నగేష్, నవీన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసాన్ని నిలిపివేయడం విచారకరం

తుంగతుర్తి : రాజీవ్ యువ వికాసాన్ని నిలిపివేయడం విచారకరమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపాక సాయిబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువకులకు అందిస్తున్న సబ్సిడీ రుణాలను పేరు మార్చి రాజీవ్ యువ వికాసంగా ఎంతో గొప్పగా ప్రారంభించి యువకులను కార్యాలయాల చుట్టూ తిప్పించి ఊరించి ఊరించి ఉసురుమనిపించారని అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలకు ప్రజలు మోసపోయారని తెలుసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సరిగా అమలు చేయలేకపోతుందన్నారు. సమావేశంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కత్తుల నరేష్ బొంకూరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రఘువీర్‌రెడ్డి

అర్వపల్లి : రెండు జాతీయ రహదారులకు ప్రధాన కూడలిగా ఉన్న అర్వపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక వ్యాపారులు, దాతలు సహకరించాలని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. సమావేశంలో పీఎస్‌ఐ తేజశ్విని, ఏఎస్‌ఐ రాములు, వ్యాపార సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల విద్యాసాగర్, పోలీస్ సిబ్బంది సోమయ్య, ఆదిరమణ, రాజ, అశోక్, త్రివేణి, రేణుక పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : దివ్యాంగులకు అందించే సహాయ పరికరాలకు దరఖాస్తు గడువు ఈ నెల 30వరకు పొడిగించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేర్కొని రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఊర ముత్యాలమ్మ దేవాలయంలో జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి లింగయ్య అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 6నుంచి 18వరకు మాత్రమే దరఖాస్తుల ఆన్‌లైన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారని, కేవలం 11 రోజుల వ్యవధిలో దరఖాస్తుకు అవసరమైన సర్టిఫికెట్లు తీసుకోవడం సాధ్యం కాదనే విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను సవరించాలని, దరఖాస్తు గడువు ఈ నెల 30వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన రూ.6వేల పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వీరబోయిన వెంకన్న, హర్షియా తాబాసుమ్ రుక్సానా, చింత సంతోష, జానయ్య, సంతోష్, కొండయ్య, కాంత్రి, సత్యం, రంగయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి అందజేత



విద్యార్థులకు నగదు అందిస్తున్న రిటైర్డ్ ఎంఈఓ

ఆత్మకూర్ (ఎస్) : విద్యార్థులు చదువులో రాణించి తమ తల్లిదండ్రుల కోరికలతో పాటు పాఠశాలకు ఉపాధ్యాయులకు గుర్తింపు తీసుకురావాలని రిటైర్డ్ ఎంఈఓ కూరెళ్ల రంగాచారి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం ఆయన నగదు బహుమతి అందజేసి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోనే గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలు అధిగమించి కన్నవారి కలలను నిజం చేస్తూ ఉపాధ్యాయుల, పాఠశాల కీర్తిపెంచాలన్నారు. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఉప్పుల గోపీచంద్‌కు రూ.3వేల నగదు, ద్వితీయ స్థానంలో ఉన్న ఉప్పుల స్పందనకు రూ.2వేలు, తృతీయ స్థానంలో ఉన్న బట్టిపల్లి కార్తీక్ రూ.వెయ్యి నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.శ్రవణ్‌కుమార్, తంగేళ్ల లక్ష్మీకాంతరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల వినతి



పంచాయతీరాజ్ సంచాలకులు శ్రీజనకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

నాగారం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ ఉపాధి సంచాలకులు శ్రీజనను పంచాయతీ కార్యదర్శులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను జూనియర్ కార్యదర్శులుగా మార్చాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శులను 4ఏళ్ల సర్వీస్ కాలాన్ని పరిగణలోకి తీసుకొని 4నోషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, 317 జీఓ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కలిసిన వారిలో తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అర్గనైజింగ్ సెక్రటరీ కె. అరుణ్, మహిళా ఉపాధ్యక్షురాలు వాణి, రాజు, నాగరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వందరోజుల ప్రణాళిక



డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

తిరుమలగిరి : మున్సిపాలిటీలో 100రోజుల ప్రణాళికలో భాగంగా 8వ వార్డు అనంతారంలో మున్సిపల్ సిబ్బంది బుధవారం డ్రెయినేజీలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సైదులు, శోభ, వార్డు ఆఫీసర్లు సోమయ్య, శ్రీను, నిఖిత, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న మండల వ్యవసాయాధికారిణి దివ్య

ఆత్మకూర్(ఎస్) : వానాకాలం 2025–26సంవత్సరానికి గాను జూన్ 5వతేదీ వరకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి దివ్య బుధవారం కోరారు. రైతు భరోసాకు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌తో ఆయా క్లస్టర్‌లోని వ్యవసాయ విస్తరణ అధికారికి ఈ నెల 20లోపు దరఖాస్తు అందజేయాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన గోళ్ల సుమన్ తల్లి జయశీల ఇటీవల మృతి చెందారు. గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ 2006–2007 పదోతరగతి బ్యాచ్‌కి చెందిన సుమన్ స్నేహితులు బుధవారం రూ.22వేల ఆర్థిక సాయం జయశీల కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో సుమన్ తోటి స్నేహితులు పరమేష్, మహేష్, చంద్రశేఖర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు, గ్రామస్తుల సహకారంతో కృషి చేస్తున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం జి.ఇందిర అన్నారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే 20మందికి పైగా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్.వెంకటేశ్వర్లు, సీహెచ్.నాగరాజు, బి.యాదగిరి, జి.మంజుల, ఆర్.నాగరాజు, బి.రమేష్, సామాజిక కార్యకర్త కృష్ణమూర్తి పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెంలో బుధవారం క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20మందికి వైద్య పరీక్షలు జరిపారు. క్షయవ్యాధిని సకాలంలో గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. క్షయ నిర్మూలన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బి.నగేష్‌నాయక్, కుంభం వీరయ్య, చొక్కయ్య, హెల్త్‌అసిస్టెంట్ గిరిజ, శైలజ తదితరులు పాల్గొన్నారు.